# పదునాల్గవ ప్రసంగము

రెండవరోజున ప్రసంగము ప్రారంభమైనంతనే రాఘవజీ భాయి అడిగెను. "నేను పుస్తకములను చాల చదివితిని. కాని, నాకు అనుభవము అగుటలేదు. కారణమేమి?"

శ్రీప్రకాశానందస్వామివారు దీనికి సంబంధించిన దృష్టాంతమును చెప్పిరి.

## మూఢుని లక్షణము.

ఒక గొర్రెలకాపరి కలడు. అతడు తన మేకలను, గొర్రెలను కాచుకొనుచు ఒక చిన్న మేకపిల్లను చంకనిడుకొని ఇటునటు తిరుగుచుండెను. సాయంకాలమువరకు అట్లు జరిగెను. మందను ఇంటికి తీసుకొని వెళ్ళుటకై చిన్నమేకపిల్లకొరకు ఇటునటు వెదుకసాగెను. కాని ఎక్కడను కన్పించలేదు. ఆవిధముగనే తిరుగాడుచు అతడు ఒకనూతి చెంతకు వెళ్ళి లోనికి చూచెను. అతనికి తన చంకనున్న మేకపిల్ల యొక్క ప్రతిబింబము కన్పించెను. అతడు ఇట్లు అరచెను. "ఏమర్రోయి, చూడండి. ఇదిగో, మేకపిల్ల నూతిలో పడిపోయినది. ప్రక్కను ఉన్న అతని సహచరుడు ఇట్లనెను. సరిగా చూచుకొనుము. మేకపిల్ల నీచంకలోనే ఉన్నది."

ఈభావమునే శంకరులు ఇట్లు చెప్పిరి:—

*తత్త్వం మాత్మస్థమజ్ఞాత్వా మూఢః శాస్త్రేషు పశ్యతి।*
*గోపః కక్షగతం ఛాగం యథా కూపేషు దుర్మతిః ॥*

"తనయందలి తత్త్వమును తెలిసికొనలేని మూఢుడు దానిని శాస్త్రములయందు వెదుకును. చంకనున్న మేకపిల్లకొరకు గొల్లవాడు నూతిలో చూచెనుకదా!"

## బ్రహ్మవిచారముచే సహజలభ్యమగు పరమతత్త్వము.

*లోకాన్తరే వాత్ర గుహాన్తరే వా తీర్థాన్తరే కర్మపరమ్పరాన్తరే,*
*శాస్త్రాన్తరే నాస్త్యనుపశ్యతామిహ స్వయం పరం బ్రహ్మ విచార్యమాణే॥*

"విచారించి చూచినచో పరమతత్త్వమగు బ్రహ్మము ఇతర లోకములయందుకాని, గుహాలయందుకాని, తీర్థములయందుకాని, కర్మకాండములయందుకాని, ఇతరశాస్త్రములయందుకాని కన్పట్టదు. సరిగా చూచినవారికి తానే బ్రహ్మము అని తెలియనగును."

ఆత్మ గోలోకమునందుకాని, వైకుంఠమునందుకాని, కైలాసమునందుకాని లేదు. గంగాదినదులయందును, ఉపనిషత్తులయందును, పురాణములయందును లేదు. యజ్ఞము, దానము, తపస్సు అనెడు పేర్లచే వ్యవహరించబడు కర్మకాండములయందుకూడ లేదు. ఈవిధముగా విచారించిచూచిన తానే బ్రహ్మము అను నిశ్చయము కలుగును. శంకరాది ఆచార్యులవారు ఈవిషయమును ఎంతయో నొక్కి తెలియజెప్పిరి. అయినను వృత్తిదోషముచే జనులు వాస్తవికముగా తత్త్వమును తెలిసికొనలేరు.

## శాస్త్రప్రతిపాదితమగు నిజతత్త్వమును తెలిసికొననందున కలుగు బాధ.

*అన్యథా పరమం తత్త్వం జనాః క్లిశ్యన్తి చాన్యథా।*
*అన్యథా శాస్త్రసిద్ధాన్తో వ్యాఖ్యాం కుర్వన్తి చాన్యథా॥*

"పరమతత్త్వము వేరొకటి. జనులు వేరొకదానియందు పరిశ్రమచేసి బాధపడుదురు. శాస్త్రప్రతిపాదితమగు సిద్ధాంతము ఒకవిధముగ నుండ దాని అర్థమును వేరొకవిధముగా చెప్పుదురు."

సత్కర్మ శాస్త్రప్రతిపాదితమగుచు వేరొకవిధముగనుండ, అసత్కర్మను సత్కర్మగ భావించి ఆచరించు నరులు కష్టములను పొందెదరు, వారికి మలదోషము నివృత్తిని పొందదు,

అటులనే సదుపాసన శాస్త్రప్రతిపాదితమగుచు పేకవిధముగనుండ, అసదుపాసనను సదుపాసనగా భావించి ఉపాసించెదరు. వారికి క్లేశమే కలుగును. వారికి విక్షేపదోషనివృత్తి కలుగదు.

అదేవిధముగ శుద్ధబుద్ధముక్త అద్వైతబ్రహ్మమును శాస్త్రములు ప్రతిపాదించుచున్నవి. అయినను అవిద్యావృతమగు అంతఃకరణము కల జనుడు భేదవిశిష్టబ్రహ్మము శాస్త్రప్రతిపాద్యమని తెలుపును.

ఇట్లు అన్ని ప్రయత్నములును అనగా కర్మ, ఉపాసన, జ్ఞానము పొందదలచిన జనుడును, ఆమూడును వ్యతిరేకమార్గమున ప్రవహించును. విపరీతవస్తువిషయకమగు ప్రయత్నము చేయువాడు సద్వస్తువును పొందలేడు. అటులనే విపరీతముకాని వస్తువునకు ప్రయత్నించు జనుడు అసద్వస్తువును పొందడు. కర్మ, ఉపాసన, జ్ఞానము ఈమూడింటికిని సంబంధించిన ఈదృష్టాంతము గ్రహించదగినది.:

మణియును, దీపమును ఒకచోట ఉంచి వానిపై ఛిద్రములు కల ఘటమును బోర్లించిన, మణికావలసిన జనుడు దీపకాంతిని మణికాంతిగా తలచి మణిని గ్రహించదలచినచో తీసికొనలేడు. కాని, మణికాంతిని మణిగా తలచి తీసికొనుటకు ప్రయత్నించినచో తీసికొనవచ్చును. దీపకాంతిని మణిగా తలచి ప్రవర్తించు మానవుడు విసంవాదిప్రవృత్తిని కలిగినందున తత్త్వమును తెలిసికొనలేడు. మణికాంతిని మణిగా తలచి ప్రవర్తించు మనుష్యుడు సంవాదిప్రవృత్తిని కలిగియుండుటచే మణిని పొందగలడు.

## సత్కర్మము శాస్త్రప్రతిపాదితము.

కర్మను తెలిసికొనకనే ఆచరించినచో మలదోషనివృత్తి కలుగదు. క్లేశముమాత్రము మిగులును.

కర్మ విధితంత్రము. అనగా విధికి అధీనమున ఉండును. శాస్త్రములయందు ఏకర్మ ఏవిధముగ చేయవలెనని చెప్పబడినదో ఆకర్మను

అదేవిధముగ చేయవలెను. అట్లు విధివిహితముగ కర్మలను ఆచరించి నప్పుడే ఫలము కలుగును. ఫలానసమయమున సంధ్యావందనము చేయవలె ననునది కాలపరమగు విధి. సంధ్యావందనముకూడ విధిని అనుసరించియే చేయవలెను. అటులనే అర్ఘ్యప్రదానము, వైశ్వదేవము, బ్రహ్మయజ్ఞము, పితృతర్పణము మొదలగు సత్కార్యములు శాస్త్ర విధిని అనుసరించి చేయవలెను.

ఇటులనే నిత్య, నైమిత్తిక, కామ్య కర్మములు, ప్రాయశ్చిత్తములు మొదలగు కర్మలు విధిననుసరించి ఆచరించిననే ఫలము కలుగును. పూర్వోక్తములగు కర్మల నన్నిటిని ఫలేచ్ఛను విసర్జించి నిష్కామభావముతో భగవత్ప్రీత్యర్థముమాత్రము చేసినచో అంతః కరణమునందలి మలదోషమును పోగొట్టి పరంపర ననుసరించి జ్ఞానమును కలుగజేయును.

## సదుపాసనము శాస్త్రప్రతిపాదితము.

ఉపాసనకూడ విధిని గమనించక చేసినచో విక్షేపదోషనివృత్తి కలుగదు. ఏలనన, ఉపాసన విధితంత్రమును, పురుషతంత్రమును మాత్రమే. వస్తుతంత్రము మాత్రము కాదు. శాస్త్రములయందు "యోషా వా అగ్నిః" అని యున్నది. "స్త్రీయందు అగ్ని అనెడు భావము కలిగియుండవలెను." ఈ శాస్త్రప్రతిపాదితమగు విధిచే స్త్రీ యందు అగ్నిభావన కలుగును. అంతట లోకప్రసిద్ధమగు అగ్నినిర పేక్షమయి స్త్రీయందు మాత్రమే అగ్నిబుద్ధి కలుగును. కావున ఇచ్చట స్త్రీయందలి అగ్నిభావము విధితంత్రము, పురుషతంత్రమును కూడను. ఆ కారణముననే హరి, హరులు, జగన్మాత కాళి, సూర్యుడు, గణపతి మొదలగువారి పూజలుకూడ శాస్త్రములయందు చెప్పబడిన విధిని అనుసరించియే చేయవలెను. ఉదాహరణముగా ఏపుష్పముతో ఏదేవుని పూజించవలెనని శాస్త్రములయందు చెప్పబడినదో దానిని

లోనే పూజించవలెను. వేరువిధముగ కాదు. ఆ విధానమునందు దోషము కలిగినచో అవిధిపూర్వకముగా చేసిన కర్మచే విక్షేపదోష నివృత్తి అనెడు ఫలము కలుగదు. క్లేశము మాత్రము కలుగును. పశ్చాత్ శ్రవణమునందు ప్రేమ కలుగదు. విక్షేపదోషము మూర్తి పూజచే (ప్రతీకోపాసనచే) పోవును. ఈవిధముగా విజ్ఞానమును పొంది మూర్తిపూజ చేసినచో సఫలుడగును.

కాని మూర్తిని పూజించుచు, అట్లు ఎందుకు పూజించవలెను అను విషయముపై దృష్టిపోవనిచో జీవితమంతయు ప్రతిమలతో ఆడుకొనుచు ఉన్నను అతనికి ఫలము కలుగదు. పిల్లలు పేడబొమ్మలతో ఆడుకొన్నట్లు విషయమును గ్రహించనిదే మూర్తిపూజను చేసినచో ఏమి ప్రయోజనము?

## శాస్త్రప్రతిపాదిత శుద్ధ- బుద్ధ- ముక్త- అద్వైత బ్రహ్మజ్ఞానము.

అటులనే శుద్ధ బుద్ధ ముక్త అద్వైతబ్రహ్మముకూడ శాస్త్ర ప్రతిపాదితమగు జ్ఞానము. అవిద్యామయమగు అంతఃకరణము కలవాడు భేదవిశిష్టమగు బ్రహ్మము శాస్త్రప్రతిపాదితమని తెలుపును. అతని ప్రయత్నము తలక్రిందుగా జరుగును. దేహేంద్రియాదుల యందు ఆత్మబుద్ధిని కలిగియుండి ఆత్మసాక్షాత్కారము పొందగోరు వానికి తత్త్వము లభించదు. అటులనే శుద్ధ బుద్ధ ముక్త బ్రహ్మమును త్యజించి క్షణికములగు సాంసారిక భోగములకొరకు గౌణదేవతలను బ్రహ్మముగా భావించి వారిని ఉపాసించిన జ్ఞానము తత్త్వమును వారు లభింపజేయలేరు. శాస్త్ర ప్రతిపాదితమగు శుద్ధ బుద్ధ ముక్త పరబ్రహ్మాత్మకమగు జ్ఞానమును విడనాడి కర్మాంగమును, ఉపాసనాంగమును స్వీకరించి విధితంత్రమును, పురుషతంత్రమును మాత్రమే అంగీకరించువాడు జ్ఞానలభ్యమును, ఆవరణనివృత్తిపూర్వకమును అగు

మోక్షఫలమును పొందడు. వాని ప్రయత్నము వేరొకదిక్కున జరుగు టయే దీనికి కారణము.

జ్ఞానము విధితంత్రమును, పురుషతంత్రమును కాదు. వస్తుతంత్రము. జ్ఞానము ప్రమాణజన్యము. ప్రమాణము యథాభూత వస్తువిశేషకము. పదార్థము ఎట్లు ఉన్నదో అటులనే దానిజ్ఞానము కలుగ జేయుట ప్రమాణపు కర్తవ్యము. లోకప్రసిద్ధమగు అగ్నియందు అగ్నిపదార్థవిషయక జ్ఞానమే ప్రమాణలభ్యము. ఇందు విధితంత్ర పురుషతంత్రముల ప్రాముఖ్యము లేదు. వస్తువు ఎట్లు ఉన్నదో అటులనే అది తెలియనగును.

పురుషుడు "కర్తుం, అకర్తుం అన్యథాకర్తుం" అనగా చేయుటకును, చేయకుండుటకును మరియొకవిధముగా చేయుటకును సమర్థుడు. కాని అట్లు వస్తుజ్ఞానము అన్యథా జరుగుటకు వీలు లేదు. ప్రకృతమగు బ్రహ్మజ్ఞానముకూడ వస్తుతంత్రమే. సచ్చిదానందస్వరూపుడగు బ్రహ్మముయొక్క భావము తత్త్వమస్యాది మహావాక్యముల ద్వారా స్వరూపమందే కలుగును.

## సిద్ధాంతమునకును, అర్థమునకును గల వైషమ్యము.

అన్యథా శాస్త్రసిద్ధాన్తో వ్యాఖ్యాం కుర్వన్తి చాన్యథా।

"శాస్త్రప్రతిపాదితమగు సిద్ధాంతము ఒకవిధముగనుండ అర్థమును మరియొకవిధముగ చెప్పుదురు." ఉదాహరణకు మనుస్మృతియందు గృహస్థాశ్రమమునకు సంబంధించిన ఈశ్లోకమును గమనించుడు:—

*కుసూలధాన్యకో వా స్యాత్ కుమ్భీధాన్యక ఏవ వా।*
*త్ర్యైహైహికో వాపి భవేదశ్వస్తనిక ఏవ వా॥*

"ఉత్తమగృహస్థుడు ఒక గాదెడు ధాన్యమునే నిలవచేయును. అంతకంటె ఉత్తముడు కుండెడు ధాన్యమునే నిలవచేయును. అతని

కంటెను ఉత్తముడు మూడు రోజులకు సరిపడు ధాన్యమునే నిలవ చేయును. అంతకంటెను ఉత్తముడు ఒకరోజుకు సరిపడు ధాన్యమును మాత్రమే నిలవచేయును."

"కుసూల" మనగా ధాన్యమునింపు గాదె. అందు కొంతకాలమునకు సరిపడు ధాన్యము ఉండును. కాని కుల్లూకభట్టు ఈశ్లోకమునకు అర్థము వ్రాయుచు సేవకాదులకును, తనకును, తనకుటుంబమునకును మూడు సంవత్సరములవరకు కాని, అంతకంటె ఎక్కువకాలమునకుకాని సరిపడుధాన్యము గృహస్థుడు తనచెంత నిలవచేసికొనును— అని వ్రాసెను. అటులనే ఒకసంవత్సరమువరకు సరిపడు ధాన్యము నిలవజేసికొనువానిని కుంభీధాన్యు డనియెను. అంతియే కాదు. తన అర్థమును సమర్థించుకొనుటకు మనువు మరియొకచోట చెప్పిన శ్లోకమును ప్రమాణముగా నిచ్చెను.

*యస్య త్రైవార్షికం భక్తం పర్యాప్తం భృత్యావృత్తయే*
*అధికం వాపి విద్యేత స సోమం పాతుమర్హతి॥*

"సోమయాగము చేయగోరువాడు సేవకులకును, తనకుటుంబమునకును మూడుసంవత్సరములవరకు కాని, అంతకంటె ఎక్కువకు కాని సరిపడు ఆహారధాన్యములను సంగ్రహించవలెను." ఈశ్లోకము యొక్క అర్థమును కుల్లూకభట్టు "కుసూలధాన్యక" అను శ్లోకమునకు తగిలించెను. నిజమునకు ఈశ్లోకము రచించుటలో మనువు ఉద్దేశ్యము సోమయాగము చేయగోరువాడు ఏఏ పదార్థములను ఎంతఎంత సంగ్రహించవలెనో తెలుపుటయే.. కుసూలధాన్యునితో దానికి సంబంధము లేదు. ఇట్లు కుల్లూకభట్టు చెప్పిన ఈఅర్థము నిరర్థకము.

ఇట్లు అసత్యార్థములను చెప్పి, తప్పుడు ప్రమాణములను చూపి, అజ్ఞానులకు సత్యమను వంకతో అసత్యమును బోధించుటచే వారు "యోగక్షేమం వహామ్యహమ్" అని భగవానుడు గీతయందు

బోధించిన వాక్యమునందు విశ్వాసముంచక తమకుగల సంపాదనపర త్వమును సమర్థించెదరు. ఈవిషయమున మరియొక దృష్టాంతము కలదు.

"ఒక గ్రామమునందలి సత్రములోనికి ఒక వైష్ణవ సాధువు వచ్చెను. ఆయన ఆచారవ్యవహారములకు సంతృప్తిచెంది ప్రజలు ఆయనను చాతుర్మాస్యలకు అక్కడ ఉండుటకు పట్టుబట్టిరి. సాధువు అటులనే అక్కడ ఉండి అందరకును భగవత్కథాకాలక్షేపము చేయించెను. అంతట ఆగ్రామస్థులు ఆనందభరితులై ఆసాధువును అక్కడనే స్థిరముగా నుండమని బ్రతిమాలిరి. సాధువుకూడ వారి మాటలు అంగీకరించెను. ఆసాధువు నివసించుటకు వారు ఒకమందిర మును నిర్మించి ఖర్చునకు భూమి మొదలగునవి సమర్పించిరి. అంతట కొంతకాలమునకు ఆసాధువు పరమపదించెను. ఆయనకు శిష్యులు లేనందున ఆస్థానమును పూరించుటకు యోగ్యుడగు వ్యక్తికొరకు జనులు వెదకసాగిరి. ఇంతలో ఒకసాధువు అక్కడకు వచ్చెను. ఆయనయందలి కొన్ని యోగ్యతలను చూచి ఎల్లరును బాగని తలచి ఆయనను ఆమందిరమున ఉండుడని కోరిరి. ఆయనకూడ అటులనే అనెను.

ఆయనకు హుక్కా త్రాగు అలవాటు కలదు. మొదట జను లకు ఆసంగతి తెలియదు. క్రొత్తసాధువుగారు మందిరములో హుక్కా త్రాగుచున్నారను సంగతి జనులకు తెలియగనే ఒకరో జున కథాసమాప్తి అయినతరువాత వారు సాధువుగారితో ఇట్లు పలి కిరి. "స్వామీ, ఇచ్చట పుగాకు నిషిద్ధము. మాగురువుగారు పుగా కును స్పృశించెడివారుకూడ కారు."

సాధువుగారు వారిని అడిగిరి. "పుగాకునందు దోషము ఏమి కలదు?"

జనులు:— శాస్త్రమునందు నిషేధింపబడినది కదా!

సాధువు:— గీతయందు భగవానుడు ఇట్లు చెప్పెను:—

"పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః॥

"సంయమముతో కూడిన అంతఃకరణముతో ఎవరైనా నాకు ఆకుకాని, పుష్పముకాని, ఫలముకాని సమర్పించిన దానిని నేను అంగీకరించెదను."

పత్రిమనగా పుగాకు. పుష్పమనగా చిలుము. ఫలము కొబ్బరి గుల్ల. ఏలనన, అందులో జలము ఉండును. ఇట్లు భగవానుడు హుక్కా సమర్పించవలెనను ఉద్దేశ్యముతో "పత్రం, పుష్పం" అను శ్లోకమును గీతయందు ప్రవచించెను. అవి అన్నియు భక్తితో భగవంతునకు సమర్పించినచో భగవానుడు సంతోషముతో స్వీకరించును. మీరు నాస్తికులవలె కన్పట్టుచున్నారు." అని సమాధానము చెప్పెను.

అంతట అజ్ఞానులగు శ్రోతలు ఇట్లనిరి- "స్వామీ! ఇట్లు మాకెవరు తెలియజెప్పలేదు. మీరు మాకన్ను విప్పిరి."

అప్పడినుండియు భగవానునకు హుక్కా సమర్పించి ఆసాధువు, వారిశిష్యులును దానిని గ్రిహించసాగిరి."

ఇటులనే తమతమ దుర్వృత్తులను సమర్థించుకొనుటకు శాస్త్ర ప్రతిపాదితములగు సిద్ధాంతములకు అర్థము తమకు వీలగునట్లు చెప్పుకొనెదరు. అర్థమునకు అనర్థము తెచ్చిపెట్టెదరు.

రాఘవజీభాయి :- ముముక్షువునకు యథార్థమగు సాధనమేది?

## అంతఃకరణమునందలి దోషములను నిర్మూలించుట.

స్వా. ప్ర. :—అంతఃకరణమున మల, విక్షేప, ఆవరణములను మూడుదోషములు కలవు. మలదోషమనగా క్రౌర్యము

చౌర్యము, జారత్వము మొదలగు పాపసంస్కారములు. అవి నిష్కామ కర్మచే నివృత్తిని పొందును. విషయలాలసచే నుండు చాంచల్యము విక్షేపదోషము. అది ఉపాసనచే నివృత్తిని పొందును. ఆవరణదోష మనగా ఆచ్ఛాదనము లేక అంతరాయము. అది జ్ఞానముచే నివృత్తి పొందును. ఈదోషనివృత్తికి అధికారిని అనుసరించి వివిధములగు సాధనములు కలవు.

వైలక్షణ్యం చ సామగ్ర్యా శ్శ్రోభయోరధికారిణోః।
కామీ కర్మణ్యాధికృతో నిష్కామీ శ్రవణే మతః॥

"అధికారిభేదముచే సామగ్రియందు వైవిధ్యము కలదు. విషయాదులయందు ఇచ్ఛకలవాడు నిష్కామకర్మకు అధికారి. నిష్కామ కర్మచే పదార్థములయందు కామమును పోగొట్టుకొనినవాడు, అనగా చిత్తచాంచల్యము నొందనివాడు వేదాంతశ్రవణమునకు అధికారి."

## నిష్కామకర్మయోగపు శ్రేష్ఠత్వము.

నిష్కామకర్మము చేయనిదే అంతఃకరణము శుద్ధిని పొందదు అని శాస్త్రప్రతిపాదితమగు సిద్ధాంతము.

అయమేవ క్రియాయోగో జ్ఞానయోగస్య సాధకః।
కర్మయోగం వినా జ్ఞానం కస్య చిన్నైవ దృశ్యతే॥

"నిష్కామకర్మయోగమే జ్ఞానమును సాధించును. అనగా కలుగజేయును. నిష్కామకర్మయోగమును అవలంబించనిదే ఎవరికిని జ్ఞానము కలిగినట్లు ఆధారము లేదు."

## వేరువేరు దోషములకు వేరువేరు నివారణపద్ధతులు.

శ్వేతవస్త్రమున దుమ్ముపట్టిన దులిపిన పోవును. ఎక్కువగా మురికియున్న నీటిలో తడిపినచో శుభ్రమగును. ఇంకను అధికముగా నున్న సబ్బు సోడా మొదలగు పదార్థములను పట్టించి ఉడకపెట్ట వలెను. అప్పుడుకాని ఆమురికి పోదు. అటులనే అనాదికాలమునుండి

చిత్తమునకు కల మాలిన్యమును పోగొట్టుటకు మాలిన్యమునకుకల తారతమ్యభేదముచే సాధనముల తారతమ్యభేదము ఆవశ్యకము. అనాదికాలమునుండియు ఉన్న అంతఃకరణమాలిన్యము అంతయు నిష్కామకర్మముచే తప్ప మరియొకవిధముగా పోదు. విషయవాసన యొక్క ప్రాబల్యము ప్రతిమానవునకును అనుభవసిద్ధము. మలినమనస్కునకు గురువు ఉపదేశించినను జ్ఞానము కలుగదు.

## ఉపదేశమునకు మలినచిత్తము నిరర్థకము.

అజమహారాజు భార్య చనిపోయెను. అందుచే ఆయనకు చాల విషాదము కలిగెను. ఆసమయమున కులగురువు వసిష్ఠులు ఆయనకు ఎన్నియోవిధముల తెలియజెప్పిరి. కాని ఆయనకు శాంతికలుగలేదు.

ఇందుకు కారణము సాంఖ్యదర్శనమున ఇట్లు చెప్పబడినది:—

*న మలినచేతస్యుపదేశబీజప్రరోహో భవేత్,*

మలినమనస్సునందు ఉపదేశబీజము నాటుకొనదు అనగా మలినమనస్కునకు ఉపదేశమువలన కలుగు ప్రయోజనము ఏమియు లేదు. అజుని మనస్సు మలినమగుటచేతనే వసిష్ఠుని ఉపదేశము నిష్ప్రయోజన మయ్యెనుకదా!

## అంతఃకరణపారిశుద్ధ్యమునకు నిష్కామకర్మము సాధకము.

*"న ఆభాసమాత్రమపి మలినదర్పణవత్"*

మురికిగల అద్దమున ముఖప్రతిబింబము పడనట్లుగనే మలినాంతఃకరణముపై ఉపదేశము లేశమాత్రము పనిచేయదు అని సాంఖ్యదర్శనము చెప్పుచున్నది. కావున ముముక్షువు మలదోష నివృత్తికొరకు నిష్కామకర్మము నాచరించవలెను. నిష్కామకర్మ ద్వారా అంతఃకరణము శుద్ధిపొందిన తదుపరి చిత్తచాంచల్యమును పోగొట్టుటకొరకు ఉపాసన ఆచరణయోగ్యము అని శాస్త్రములు ఘోషించుచున్నవి,

ఉపాసనావిహీనస్య సర్వశాస్త్రవిదోఽపి వా,
చిత్తవిక్షేపహానిః స్యాన్నైవ కల్పాన్తరైరపి॥ (రామగీత)

ఉపాసనాహీనుడగు నరుడు శాస్త్రజ్ఞుడైనను చిత్తచాంచల్యము పొందును. చిత్తవిక్షేపమునుండి రక్షణ పొందలేడు. ఈకల్పమునందే కాదు, ఇతర కల్పములయందుకూడ పొందలేడు. ఇక ఈకల్పము సంగతి వేరుగా చెప్పనేల?

## సగుణోపాసన.

పరమాత్మస్వరూపము సగుణము, నిర్గుణము అని రెండు రకములు.

సకామసగుణోపాస్తిర్నృణాం భోగాయ సంభవేత్,
నిష్కామా చిత్తశుద్ధ్యర్థేత్యేవం శాస్త్రార్థనిర్ణయః॥

"కామముతో సగుణోపాసన చేసినచో నరులకు భోగ్యపదార్థములు లభించును. నిష్కామియగుచు సగుణోపాసనచేసినచో చిత్తశుద్ధి యగును. ఇట్లు శాస్త్రార్థముచే తేలినది."

## వివిధములగు ఉపాసనాపద్ధతులు.

ఉపాసన ప్రతీకోపాసన, అహంగ్రహోపాసన అని రెండురకములు. అన్యమునందు అన్యబుద్ధిని చేయు ఉపాసన ప్రతీకోపాసన. సాలిగ్రామ,శివలింగాదులయందు విష్ణు, శివాదుల భావముతో చేయు ఉపాసన ప్రతీకోపాసన. ఉపాస్య, ఉపాసకులపట్ల అభిన్నభావముతో నలుపు ఉపాసన అహంగ్రహోపాసన.

## సగుణోపాసన.

అహంగ్రహోపాసనకు మూర్తి వేరొకటి అక్కరలేదు. విష్ణు, శివాదులను ప్రస్తుత ఆచారానుసారము చక్రహస్తుడు, త్రిశూలధారి

అను భావములతో చేయు ఉపాసన పురాణోక్తము. తంత్రసమ్మతము. వేదోక్తమగు విష్ణుసూక్తముద్వారా పరమాత్మరూపమును— విష్ణు, శివాత్మకమగు పరమాత్మరూపమును ఉపాసించుట వైదికవిష్ణు అహంగ్రహోపాసన యనియు,- వైదికశివ అహంగ్రహోపాసన అనియు చెప్పబడును.

వీనికంటె వేరగు విరాట్టుయొక్క అనగా హిరణ్యగర్భుని యొక్క అహం గ్రహోపాసన వేదములయందు చెప్పబడినది. ఇందు వేదోక్తవిధి ననుసరించియును, పురాణాదుల ననుసరించియును అహంగ్రహోపాసన చేయవలెను.

"సహస్రశీర్షా పురుషః" ఇత్యాది వేదమంత్రములద్వారా విరాట్ పురుషుని ఉపాసన జరుగును. "హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే" మొదలగు మంత్రములద్వారా హిరణ్యగర్భోపాసన జరుగును. నిర్గుణ బ్రహ్మోపాసన చేయుటకు సమర్థులు కానివారికొరకు సగుణ బ్రహ్మోపాసనావిధికి శాస్త్రములయందు ప్రతిపాదించబడినది.

*నిర్విశేషం పరం బ్రహ్మ సాక్షాత్కర్తుం అనీశ్వరాః।*
*యేమన్దాస్తేఽనుకమ్ప్యన్తే సవిశేషనిరూపణైః॥*

"నిర్విశేషపరబ్రహ్మసాక్షాత్కారము పొందు సామర్థ్యములేని మందాధికారులపైగల అనుగ్రహముచే సగుణబ్రహ్మోపాసన విధించబడినది."

## నిర్గుణోపాసన.

సగుణోపాసన పరిపక్వము అయిన తదుపరి నిర్గుణోపాసన చేయబడును. రామగీతయందు ఇట్లున్నది.

*అఖణ్డసచ్చిదానన్దనిర్గుణోపాసనం మహత్।*
*సద్యః కైవల్యహేతుః స్యాదహం బ్రహ్మేతి చిన్తనమ్॥*

"నేను బ్రహ్మమును అను ఆలోచనతోకూడిన అఖండసచ్చిదానంద నిర్గుణబ్రహ్మముయొక్క అహంగ్రహోపాసన సాధనము లన్నింటి

కంటెను శ్రేష్ఠమగు సాధనము. అది వెంటనే అపరోక్షజ్ఞానము ద్వారా మోక్షమును లభింపజేయును.''

అయినను నిర్గుణోపాసన చంచలచిత్తునకు కష్టసాధ్యము. సామాన్యజనులకు సగుణోపాసన ఆచరణీయము. సగుణోపాసనకూడ చేయలేని నరుడు నిష్కామకర్మయోగమును ఆచరించవలెను. నిష్కామకర్మకుకూడ అసమర్థుడైన సకామకర్మమునే చేయవలెను. సకామకర్మమునుకూడ ఆచరించలేనివాడు నికృష్టుడు. అతనికి అధోగతి కలుగును. ఇట్టివారు పామరు లనబడుదురు.

పంచదశి చెప్పుచున్నది:—

*పామరాణాం వ్యవహృతేర్వరం కర్మాద్యనుష్ఠితిః।*
*తతోఽపి సగుణోపాస్తిః నిర్గుణోపాసనా తతః॥*

"పామరులవలె వ్యవహరించుటకంటె వైదికకర్మానుష్ఠానము శ్రేష్ఠము. వైదిక కర్మానుష్ఠానముకంటె సగుణబ్రహ్మోపాసన శ్రేష్ఠతరము. సగుణబ్రహ్మోపాసనముకంటె నిర్గుణోపాసన శ్రేష్ఠతమము.''

జ్ఞానమునకు సాక్షాత్సాధనమగునది అన్నిసాధనములకంటెను ఉత్తమమని తాత్పర్యము.

రాఘవ:—నిర్గుణబ్రహ్మమును ఎట్లు ఉపాసించవలెను?

స్వా.ప్ర.:—ఈప్రశ్న మహాత్ములను ఎవరినైనా అడుగవలసినది. నేను మహాత్ముడను కాను. జ్ఞానిని కాను.

## అనధికారికి ఉపదేశించుట నిషిద్ధము.

ఈసందర్భములో శ్రీనిత్యానందులవారు రాఘవజీ వైద్యతో ఇట్లనిరి. మీరు మొదట అధికారమును పొంది రండి. అనంతరము స్వామివారు తెలిపెదరు. విషయపంచకమునుండి ముక్తిని పొందువరకు బ్రహ్మవిద్యను తెలిసికొను అధికారము లభించదు. వైరాగ్య

హీనునకు బ్రహ్మవిద్యోపదేశము చేయుట ధర్మము కాదు. అనధికారికి ఉపదేశించరాదని శ్రుతి ఘోషించుచున్నది.

*విద్యా హ వై బ్రాహ్మణమాజగామ గోపాయ మా శేవధిష్టేఽహమస్మి।*
*అసూయకాయానృజవేఽయతాయ న మా బ్రూయా వీర్యవతీ తథా స్యామ్॥*

"బ్రహ్మవిద్య బ్రహ్మజ్ఞునిచెంతకు వెళ్లి పలికెను. నీవు నన్ను రక్షించుము. నేను నీధనాగారమును. అసూయకలవానికి, కపటికి, ఇంద్రియనిగ్రహము లేనివానికి నీవు నన్ను ఉపదేశించకుము. ఈవిధముగ అసూయాపరుడు మొదలగువారికి ఉపదేశించకుండుటచే నేను బలమును పొందెదను."

## అనధికారికి ఉపదేశించుటచే బ్రహ్మవిద్య విలపించును.

ఒకమారు ఒక బ్రహ్మజ్ఞుడు అనధికారికి బ్రహ్మవిద్యను సమర్పించెను. అంతట బ్రహ్మవిద్య ఎంతయో ఖేదముతో కండ్ల నీరుకార్చుచు బ్రహ్మజ్ఞులు కల చోటికివెళ్ళి గద్గదకంఠముతో నిట్లు పలికెను. ఓబ్రహ్మజ్ఞులారా!నన్నురక్షించుడు.సత్పాత్రుడగు అధికారికిమాత్రమే సమర్పించుడు. పాత్రాపాత్రవిచక్షణములేక నన్ను ఎవరికిపడితే వారికి అర్పించరాదు. గుణహీనులకు ఇచ్చుచున్నారేమో కొంచెము ఆలోచించుడు. ఏలనన. వారు నాపేర ఎన్నియో అనర్థములు చేయుదురు. నాపేర ప్రపంచమును కొల్లగొట్టుదురు, శ్రద్ధాశీలురగు భక్తులను బాధించుదురు. అసత్యమూలకమగు కీర్తిని సంపాదించుటకు వారు నాపేరట అనేకములగు ఆడంబరములను చేయుదురు.నాయందు శ్రద్ధయును, పరిపూర్ణజ్ఞానమును లేకుండయుండు అధములకు బ్రహ్మవిద్యఅనెడు వివిధరూపధారిణియును, పరమానందదాత్రియును అగు నన్ను అర్పించుట అనగా అపాత్రునకు సౌందర్యవతిని కన్యాదానము చేయుటయే. అట్టిపని చేయకుడు."

ఓ బ్రహ్మజ్ఞులారా! నన్ను కుపాత్రుకు ఇచ్చిన నాకును, మీకును, ఉభయులకును శ్రేయోభంగము కలుగును. గుణవంతుని నిందించు వారు, స్వభావకుటిలులు, ఇంద్రియములను వశపరచుకొననివారు, వశులు కానివారు, గురువునందు శ్రద్ధలేనివారు— అట్టిఅధములకు నన్ను అర్పించకుడు. శమదమాదిగుణయుక్తులకే నన్ను ఉపదేశించుడు. మీరు నన్ను రహస్యముగా నుంచుడు. అధికారికి అర్పించుడు. నేను మీకు కామధేనువువలె మనోవాంఛితములను ఈడేర్చెదను. మీరు గుణహీనునకు నన్ను ఉపదేశించిన ఫలహీనమగు లతవలె ఉందును. వంధ్యాత్వమును పొంది మీకు కాని, వారికి కాని, ఏట్టిఫలమును ప్రసాదించను.

వేదాన్తే పరమం గుహ్యం పురాకల్పే ప్రచోదితమ్।
నాఽప్రశాన్తాయ దాతవ్యం నాపుత్రాయ శిష్యాయ వా పునః॥

అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పుచున్నది.

ఉపనిషత్తులలో పరమపురుషార్థముగా చెప్పబడిన అతిరహస్యమును, కల్పాదియందు బ్రహ్మ ఉపదేశించిన బ్రహ్మవిద్యను ప్రశాంతచిత్తుడు కానట్టి శిష్యునకుగాని, పుత్రునకుగాని ఉపదేశించరాదు.

ప్రశాంతచిత్తుడు :— దర్పాదిదోషములు శమించినవాడు శాంతచిత్తుడు. దర్పాదులనగా— దర్పము, ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, కామము, క్రోధము, లోభము, మోహము, హర్షము, అసూయ, అహంకారము, నింద, గర్వము, మత్సరము, దంభము మొదలగునవి.

ఇతరుని తిరస్కరించుట మొదలగువానియందు దృఢమగుభావము కలిగియుండుట దర్పము. ధనాదులందు అభిలాష ఇచ్ఛ. శత్రువులు మొదలగువారిని వధించవలెనను భావము ద్వేషము. అనుకూలములగు ద్రవ్యాదులు లభించనందున కలుగు బుద్ధియొక్క అస్వాస్థ్యము

దుఃఖము. స్త్రీ మొదలగువానియందలి అభిలాష కామము. అభిలషితపదార్థమునందు కలిగిన విఘాతముచే బుద్ధికి కలుగు క్షోభము క్రోధము. లభించిన ధనమును త్యాగముచేయు అభిప్రాయము లేకపోవుట లోభము. దుఃఖము కలుగజేయు పదార్థములయందు సుఖము కలుగజేయు పదార్థములనెడు భావము మోహము. చిత్తగతమగు సుఖమును అభివ్యక్తముచేయు ముఖవికాసాదులకు హేతుభూతమగు చిత్తవృత్తి హర్షము. ఇతరుల గుణములయందు దోషారోపముచేయు బుద్ధి అసూయ. దేహేంద్రియాదులయందు ఆత్మతత్త్వభ్రమ అహంకారము. జనులను దూషించుట నింద. ఇతరులకంటె నేను గొప్పవాడను అనుకొనుట గర్వము. విద్యా, ధనాదులయందు ఇతరుల సాటిని పొందవలెనననునది మత్సరము. ఇతరుల ఎదుట తన జప, ధ్యానాదులను ప్రకటించుట దంభము. ఈవిధములగు దోషములు లేనివాడు ప్రశాంతచిత్తుడు. ఈ దర్పాదిదోషయుక్తుడు జ్ఞానసంపాదనకు అర్హుడు కాడు. భగవద్గీతలో చెప్పినప్రకారము అసురరాక్షససంపదలను విడనాడి దైవసంపదను అలవర్చుకొనినవాడే ప్రశాంతచిత్తుడు. ఈవిషయమున ప్రశ్నోపనిషత్తునందు ఇట్లు చెప్పబడినది.

పిప్పలాదమునివద్దకు భారద్వాజాదిఋషులు ఆరుగురు చేతిలో సమిధలు పట్టుకొని వెళ్ళిరి. వారిని పిప్పలాదుడు ప్రశ్నించెను. "మీరు ఏలవచ్చిరి?" వారు చెప్పిరి. "మేము బ్రహ్మవిద్యను పొందుటకు వచ్చితిమి." పిప్పలాదుడు ఇట్లనెను. "బ్రహ్మవిద్య ఇట్లు లభించదు. మీరు ఒకసంవత్సరము నాచెంత నుండుడు. తరువాత వచ్చినచో చెప్పెదను."

ఒక వత్సరమువరకు వారిని ఉంచుటలో ఉద్దేశ్యము వారి అధికారమును కనుగొనుటయే. బ్రహ్మవిద్య రహస్యముగా నుంచబడుచుండెడిది. అధికారియే దానిని పొందెడివాడు. ఆచరించుచు కూడ ఉండెడివాడు.

## అనధికారికి అర్పించిన బ్రహ్మవిద్య నిష్ఫలము.

బ్రహ్మవిద్య ప్రస్తుతము నాటకస్థాయికి చేరినది. మహారాజు హరిశ్చంద్రుడు సత్యముకొరకు రాజ్యాదులు త్యజించి అనేకకష్టములను సహించెను. ఈ విషయము ఇప్పుడు నాటకముద్వారా చూపబడుచున్నది. హరిశ్చంద్రపాత్రధారి రోజంతయు ఎన్నియో అసత్యములు పలుకును. కాని నాటకములో మాత్రము సత్యవ్రతశీలుడుగా అభినయించును. ప్రజలు హరిశ్చంద్రుని కంఠము బాగుగా ఉన్నది. చంద్రమతి రూపము బాగుగా ఉన్నది. దృశ్యములు ఎంతయో చక్కగ ఉన్నవి అని ప్రశంసించెదరు. అటులనే మావంటి వారు కొందరు ఉపన్యాసములు చెప్పునప్పుడు జనులు నాటకమునకు వెళ్ళునట్లుగనే దారాపుత్రాదులనుకూడ తీసికొని వెళ్ళుదురు. ఉపన్యాసములను వినెదరు. కాని సత్యతత్త్వమును గ్రహించు సామర్థ్యము కలుగదు. ఉపన్యాసము బాగుగా ఉన్నది. ఉపన్యాసకులు గొప్పవిద్వాంసులు. అని అనేకవిధములుగా స్తుతించి సంతోషించెదరు. జనులు మొదటి నాటకకంపెనీని ఎక్కువ పొగడుదురు. తరువాత రెండవ నాటకకంపెనీని దానికిమించి పొగడుదురు. మూడవ నాటకకంపెనీని పైరెండింటికంటె ఎక్కువగా స్తుతించెదరు. అదేవిధముగా ఒక ఉపన్యాసకుని వ్యాకరణపండితు డనెదరు. మరియొక ఉపన్యాసకుని మొదటివానికంటె తర్కమునందు దిట్టయని ప్రశంసించెదరు. మూడవ మహాశయుని ఉపన్యాసధోరణి పైఇద్దరికంటె ఉన్నతమైనదని స్తుతించెదరు. శ్రుతి, స్మృతులు కంఠస్థము లనెదరు. ఇట్లు నటీనటవర్గమును స్తుతించినట్లు, ఉపన్యాసకులనుకూడ స్తుతించి, టిక్కట్లు కొనినట్లుగనే కానుకలను సమర్పించెదరు.

ఈవిధముగ చెప్పిన- వినిన ఉపన్యాససారాంశమును ఆచరణలో నుంచుటకు శ్రోతకాని—ఉపన్యాసకుడుకాని ఎవరును ప్రయత్నించరు. ఈవిషయమును గమనించిన మహాపురుషులు ఉపదేశమును

చేయరు. ఏలనన అనధికారికి బ్రహ్మవిద్యను ఉపదేశించినచో చవిటి నేలను నాటిన బీజమువలె వ్యర్థమగును. అనధికారియగు శ్రోతకూడ బ్రహ్మవిద్యను ఆదరించనందున దోషమును పొందును. ఆత్మజ్ఞానమునకు సంబంధించిన మోహముచే మలినమగు అంతఃకరణము కలిగియుండగనే కర్మమును, ఉపన్యాసమును త్యజించును. కావున మహాపురుషులు వివేకాది సాధనసంపత్తి కలవారికిమాత్రమే బ్రహ్మవిద్యను ఉపదేశించెదరు. ఇక మిగిలిన సామాన్యజనులకు నిష్కామకర్మ, ఉపాసన, పరమాత్మ అస్తిత్వమును బోధించు ధర్మములు మొదలగునవి బోధించెదరు. బ్రహ్మవిద్యను అనధికారికి ఉపదేశించుటచే కలుగుదోషము వ్యాసభగవానుడు ఇట్లు తెలిపెను:—

*అజ్ఞస్యార్ధప్రబుద్ధస్య సర్వం బ్రహ్మేతి యో వదేత్,*
*మహానిరయజాలేషు స తేన వినియోజితః॥*

"అజ్ఞానికిని, అల్పజ్ఞానికిని సర్వమును బ్రహ్మమే అని ఉపదేశించువాడు అనంతములగు నరకబాధలను పొందును."

ఒకనగరమున ఒక సన్యాసి చాతుర్మాస్యలు చేయుచుండెను. చాతుర్మాస్యల నాలుగుమాసములు వేదాంతోపన్యాసము చేసెను. ఒక నిష్ఠాపరుడగు బ్రాహ్మణుని భార్య నాల్గుమాసములును ఆ ఉపన్యాసములను వినెను. ఆమె మహావాక్య చతుష్టయముయొక్క అర్థము విని, వాని అంతరార్థమును తెలిసికొనలేక బాహ్యార్థమును మాత్రమే గ్రహించి "అహం బ్రహ్మాస్మి" అయిపోయినది. అనంతరము ఒకరోజున ఆమె వంటచేసి వైశ్వదేవము చేయకుండ భోజనమునకు కూర్చొనెను. భర్త ఆమెను అడిగెను. "వైశ్వదేవము చేయనిదే నీవు భోజనమునకు ఏలకూర్చొనెదవు?"

ఆమె భుజించుచు సమాధానము చెప్పెను:—

*అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,*
*ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్॥*

"నేను జఠరాగ్నిరూపమున ప్రాణుల శరీరమునఉండి ప్రాణా ఉపానవాయువులతో కలసి భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యములనెడు చతుర్విధ ఆహారపదార్థములను జీర్ణింపజేయుదును."

ఇది విని భర్త పొయ్యిలో మండుచున్న కొరకంచు తెచ్చి ఆమె శరీరమునకు అంటించబోయెను. భార్య "మొర్రో" అని దూరముగా పారిపోయెను. అదిచూచి భర్త చెప్పెను:—

*నైనం ఛిన్దన్తి శస్త్రాణి, నైనం దహతి పావకః ।*
*న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥*

"ఈ ఆత్మను శస్త్రములు ఛేదించలేవు. అగ్ని మండించలేదు. నీరు తడుపలేదు. గాలి ఆర్చలేదు."

తాత్పర్యమేమన, అనధికారియగు శ్రోతకు చెప్పిన ఉపదేశము విపరీతపరిణామమును పొందును.

కావున మహాత్ములు ఉపన్యాసములకు దూరముగా నుండురు. ఏమైన చెప్పిన మామూలుధోరణిలో చెప్పెదరు. ధర్మమునకు పునాది నీతి. పునాదిలేనిదే ఇల్లు నిలవనట్లుగానే నీతిలేనిదే ధర్మము నిలువదు. శ్రీసరయూదాసస్వామిగారు, శ్రీజానకీదాసస్వామిగారు అద్వైతనిష్ఠాపరులైనను ప్రజలకు సామాన్యనీతిమార్గమునే బోధించిరి. "సత్యము పలుకుము. సత్యమార్గమున సంచరించుము" మొదలగు ఉపదేశములనే చేసిరి. ఈ ఇరువుర మహాత్ముల ప్రభావముచేతను అచ్చటి వాతావరణము సాత్త్వికముగను, సౌమ్యముగను, శాంతముగను ఉండెడిది. మాయాగంధము అచ్చట ప్రవేశించెడిది కాదు. కానుకలు, పూజలు మాట అటుండనిండు. పత్రిపుష్పాదులు సమర్పించుటకు కూడ అచ్చట నిర్బంధము కలదు. 'ఇట్టి మహాపురుషుల తరువాతవారికి మఠములు, ఆశ్రమములు, శిష్యప్రశిష్యులు ఎట్లు ఉండెదరు?

## నిర్గుణ ఉపాసనకు ప్రారంభోపాయము.

"అహం బ్రహ్మాస్మి" అనునది అభేదోపాసనావాక్యము. అనధికారి ఈవాక్యమును విని ఉపాసనను త్యజించును. "నేనే బ్రహ్మమును. మరి ఉపాసించుట ఎవరిని? నా స్వరూపమునందు త్రికాలములయందును బంధమోక్షములు, పుణ్యాపాపములు లేవు." ఇట్లు పలుకుచు ఇష్టము వచ్చినట్లు సంచరించును. కావుననే మీరు మొదట నిష్కామకర్మము సగుణబ్రహ్మోపాసన మొదలగునవి ఆచరించి అధికారమును పొందుడు. అనంతరము నిర్గుణోపాసన చేయగలరు.

రాఘవ:— అది అయిన మాప్రారబ్ధమునందు ఉన్ననేకదా జరుగునది?

## పురుషార్థముద్వారా ప్రారబ్ధమునందు మార్పు సంభవము.

స్వా.ని :—ఒక బ్రాహ్మణుడు కలడు. ఆతనికి భగవంతుని పొందవలెనను తీవ్రమగు కోరిక కలుగుటచే భార్యకు నచ్చ చెప్పి అరణ్యములోనికి వెళ్లెను. అచ్చట ఆతడు ఒక మర్రిచెట్టుక్రింద భజన చేయ గూర్చొనెను. నారదుడు ఆమార్గమున వెళ్ళుచు ఆబ్రాహ్మణుని చెంతకు వచ్చెను. బ్రాహ్మణుడు ఆయనను సత్కరించి అడిగెను. "తమరు ఎవరు?"

నారదుడు:— "నేను ఒకచోట ఉండనివాడను, నారదుడను. త్రిలోకసంచారిని.

బ్రా:— "మహాభాగ్యము. తమరు వైకుంఠమునకు వెళ్ళినప్పుడు స్వామివారిని నాయందు దయచూపి ఎప్పుడు నాకు దర్శనమిచ్చెదరో కనుగొనుడు. తమరు తిరిగీ ఎప్పుడు దయచేయుదురు?"

నారద:— "రేపే వెళ్ళి ఎల్లుండి సమాధానము తెచ్చెదను"

నారదుడు వైకుంఠమునకు వెళ్ళి విష్ణుభగవానుని బ్రాహ్మణుని గురించి అడిగెను. విష్ణువు అతడు దురదృష్టవంతుడనియు, ఆతడు

కూర్చొనియున్న చెట్టునకు ఎన్ని ఆకులు కలవో అన్ని జన్మములు ఎత్తినతరువాత దర్శనము ఇచ్చెదననియు చెప్పెను. చెప్పినవిధముగానే నారదుడు బ్రాహ్మణునిచెంతకు వచ్చి పలికెను. నాయనా! నీవు అడిగినప్రశ్నకు సమాధానము ఇప్పుడు తెలిసికొనకుండుట మంచిది. కాని బ్రాహ్మణుడు ఒప్పుకొనలేదు. ఎంతయో పట్టుపట్టినమీదట నారదుడు సంగతులు విశదీకరించెను. అది విని బ్రాహ్మణుడు ఆనందముతో పొంగిపోయెను. "ఆహా! ఎంత అదృష్టము. నాకు ప్రభువు దర్శనమిచ్చును." అది చూచి నారదుడు ఇట్లనెను. "ఓరి పిచ్చివాడా! చాల జన్మలతరువాత కదా!"

బ్రాహ్మణుడు:- "అయినను దర్శనము ఇచ్చుట నిజమేకదా!"

ఇట్లు పలికి ఆతడు ఆనందముతో నాట్యముచేయుచు "స్వామివారిని దర్శించగలను. స్వామివారిని దర్శించగలను." అనుచు గంతులు వేయసాగెను. ఈవిధముగా ఆతని చిత్తము భగవంతునియందు నిమగ్నమయ్యెను. వృత్తి పరమాత్మమగ్నమగుటతోడనే శ్రీమహావిష్ణువు ఆతనికి దర్శనమిచ్చెను. ఇది చూచినతోడనే నారదునకు మిక్కుటమగు ఆశ్చర్యము కలిగెను. ఆయన శ్రీమహావిష్ణునితో నిట్లనెను. "ఓ నల్లవాడా! నీవు చాల మోసగాడవు. ఇది ఏమి? నన్నుకూడ పడగొట్టితివే! నిన్ననే ఈచెట్టునకు ఎన్ని ఆకులు ఉన్నవో అన్ని జన్మలు ఎత్తినకాని ఈబ్రాహ్మణునకు దర్శన మియ్యనని చెప్పితివికదా!"

భగవానుడు:— బ్రాహ్మణుని ప్రారబ్ధము అట్లు ఉండెను. కాని భక్తి అనెడు త్రాటితో నన్ను కట్టుటతోడనే నేను భక్తపరాధీనుడను అయిపోవుదును. "అహంభక్తపరాధీనః." (శ్రీమద్భాగవతము)

యోగ్యమగు పురుషార్థముచే ప్రారబ్ధమును నివృత్తి నొందించవలెను. కావున మీరు భగవంతుని ప్రేమించుడు. మాయాపదార్థములయందలి ప్రేమను విడనాడుడు.

రాఘవ:—మాయాపదార్థముల యందలి ప్రేమను విడనాడుటకు నేను ఎంతయినను ప్రయత్నించుచున్నాను. కాని మనస్సు చాల బలముకలది. ఈజీవితములో వశపడునా అనిపించుచున్నది.

శ్రీనిత్యానందస్వామివారు శ్రీప్రకాశానందులవారిని ఈసందేహము నివృత్తినొనరించమని కోరిరి.

స్వా॥ ప్ర॥ :—యోగవాశిష్ఠమున వశిష్ఠులవారు చెప్పిరి.

*మనో ధావతి సర్వత్ర మదోన్మత్తగజేన్ద్రవత్ ।*
*జ్ఞానాఙ్కుశసమా బుద్ధిస్తస్యా నిశ్చలతే మనః ॥*

"మనస్సు మదోన్మత్తమగు గజేంద్రమువలె అన్నివైపులకును పరుగిడును. దానికి వివేకజ్ఞానమను అంకుశముద్వారా ఏకాగ్రతను కలిగించుటచే చాంచల్యముః పోయి స్థిరత్వమును పొందును."

రాఘవ:—మనస్సును ఆపు సాధనమెద్ది?

స్వా॥ ప్ర॥ :—మనస్సే మనస్సును ఆపును. వజ్రము వజ్రముచేతనే భేదించబడును. లోహాదులచే కాదు. అటులనే మనస్సును ఆపునది మనస్సుమాత్రమే.

*మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాశుద్ధమేవ చ ।*
*అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితమ్ ॥*

"కార్యపరత్వముచే మనస్సు శుద్ధము, అశుద్ధము అని రెండు రకములు. అందులో మలినవాసనలతో కూడినమనస్సు అశుద్ధమనస్సు అనబడును. శుద్ధవాసనలతో కూడినమనస్సు శుద్ధమనస్సు."

శుద్ధమనస్సు సత్త్వప్రధానము. అశుద్ధమనస్సు రజస్తమోగుణ ప్రధానము. రజస్తమోగుణములను తగ్గించి సత్త్వప్రాధాన్యమును పొందిన మనస్సును వశపరచుకొనవచ్చును.

రాఘవ:—మనస్సును వశపరచుకొను సాధనమేమి?

స్వా॥ ప్ర॥ :—శ్రవణ, మనన, నిదిధ్యాసనములు మనస్సును వశపరచుకొను సాధనములు.

రాఘవ:—శ్రవణ మననములను చేయుచున్నాను. కాని నిది ధ్యాసన మన నేమియో తెలియుటలేదు. సెలవిండు.

స్వా॥ ప్ర॥ :—ప్రాపంచిక జీవులు శ్రవణ మననములు చేయ నిచో నిదిధ్యాసనము ఏమిచేయుదురు?

*బ్రహ్మచర్యాద్వా గృహాద్వా వనాద్వా సంన్యస్య శ్రవణం కుర్యాత్ (శ్రుతి)*

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థములనుండి సన్యాసమును తీసికొని శ్రవణమును చేయవలెనని శ్రుతి చెప్పుచున్నది. గృహస్థాశ్రమమునుండి ఒకేమారు సన్యాసము తీసికొనుట దుర్ఘటము. గృహస్థాశ్రమమునందు చేసిన అసంఖ్యాకములగు పాపముల నివృత్తికొరకు వానప్రస్థమును తీసికొని తపస్సుచేయవలెను. తపముచే సమస్తపాపములు నశించినతరువాత సన్యాసము తీసికొనవచ్చును. వానప్రస్థాశ్రమమునందు దారాపుత్రాదులకు వలయుపర్పాట్లు చేసినతరువాతనే సన్యసించవలెను. రాజనీతియందుకూడ దారాపుత్రాదుల జీవిత నిర్వాహణమునకు పూర్తిగా ఏర్పాట్లుచేసి రాజుగారి అనుమతి తీసికొని వానప్రస్థమును స్వీకరించవలెనని చెప్పబడినది.

*"పుత్రదారమప్రతివిధాయ ప్రవ్రజతః పూర్వః సాహసదణ్డః॥*

దారాపుత్రాదుల జీవితనిర్వాహణమునకు వలయు ఏర్పాట్లు చేయనిదే సన్యసించు వానికి సాహసదండన విధించబడినది. అట్టి సాహసము చేయువాడు బ్రాహ్మణుడైన రాజు అతనిని అవమానించి తల గొరిగించి గాడిదపై కూర్చొనబెట్టి దేశమునుండి బైటికి వెళ్లగొట్టవలెను. ఇతరులైన ఖైదు, అంగచ్ఛేదము, శరీరదండన, ద్రవ్యదండన మొదలగు వివిధములగు శిక్షలు నిర్దేశించబడినవి.

రాఘవ:—నాకు దారాపుత్రాదులకు వలయునంత ధనము లేదు. అందుచే సన్యాసము తీసికొను అధికారము నాకు లేదు. పిల్లలు

పెద్దవారు అయినతరువాత ఉత్తరావస్థలో ఆతురసన్యాసము తీసికొనెదను.

స్వా॥ ప్ర॥ :—ఇది ఎంతయో బాగుగా ఉన్నది. ఆతురసన్యాసము తీసికొనినచో పిల్లలకు తండ్రి ఉత్తరక్రియలు చేయుటలో ధనవ్యయము తగ్గుననియే కదా మీ అభిప్రాయము.

అందరును ఫక్కున నవ్విరి.

రాఘవజీభాయి అమాయకుడు. కావున స్వామివారు ఆయనతో ఇట్లు వినోదముగా సంభాషించుచుండిరి.

అనంతరము స్వామి శ్రీప్రకాశానందులవారు పీఠడియానుండి వెళ్ళుటకు వలయు ఏర్పాట్లు చేయసాగిరి. శ్రీనిత్యానందస్వామివారు ఇట్లనిరి:—

"తమరు ఇచ్చటనుండి వెళ్ళిపోవుట ఏమియు బాగుగ లేదు."

స్వా॥ ప్ర॥ :—దూరస్థోపి సమీపస్థో యో యస్య హృది వర్తతే,
యో యస్య హృదయే నాస్తి సమీపస్థోఽపి దూరగః

"దూరమున ఉన్నను హృదయములో నున్నవాడు దగ్గరనే ఉండును. దగ్గరగా నున్నను హృదయములో లేనివాడు దూరముగనే ఉండును." తమకు నాయందు ఎంతయో ప్రేమ. కావున నేను ఎల్లప్పుడు తమ చెంతనే ఉండెదను.